సాగు చేసేదెలా..?



రామచంద్రాపురం ఎత్తిపోతల పథకం

- సక్రమంగా అందని సాగునీరు
- బీడు భూములుగా పంట పొలాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

జలుమూరు: మండల పరిధిలోని జలుమూరు, లింగాలవలస, రామచంద్రాపురం, టెక్కలిపాడు ఎత్తిపోతల పథకాలతో సుమారు 5,000 ఎకరాలు సాగవుతున్నాయి. అయితే వీటి నిర్వహణ, మరమ్మతులు ఏటా సక్రమంగా చేయకపోవడంతో రైతులకు సక్రమంగా సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రం జలుమూరు ఎత్తిపోతల పథకం నిర్వహణ అధ్వానంగా ఉండడంతో పాటు పైపులైన్ల లీకులు వలన అన్నదాతకు అవస్థలు తప్పడం లేదు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా 500 ఎకరాలకు సాగునీరు అందించడం లక్ష్యం కాగా, కనీసం 50 ఎకరాలకు కూడా నీరు సక్రమంగా అందడం లేదు. అలాగే రామచంద్రాపురం ఎత్తిపోతల పథకం ద్వారా 1300 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే గత సంవత్సరం దీని ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు ఎత్తికెళ్లడంతో ఇప్పటివరకు వీటి స్థానంలో కొత్తది ఏర్పాటు చేయకపోవడం, అలాగే చిన్నపాటి మరమ్మతులు చేయకపోవడంతో జోనంకి, గంగధరపేట, చల్లవానిపేట, అబ్బాయిపేట తదితర గ్రామాలకు చుక్కనీరు వెళ్లడం లేదు. దీంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వీటి నిర్వహణ కూడా ప్రారంభం నుంచి కొద్దిమంది రైతుల చేతిలో ఉండిపోవడంతో కేవలం అక్కడికి దగ్గరలో ఉన్న పొలాలకు సాగునీరు అందించి, మిగిలిన గ్రామాలకు మాత్రం కనీసం నీరు ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఎంతో లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ ఎత్తిపోతల పథకాల నిర్వహణ సక్రమంగా చేయకపోవడంతో పంట పొలాలు బీడు భూములుగా మారిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

ఇప్పటికే మండల పరిధిలో ఉన్న నాలుగు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి మరమ్మతులు, పైపులైన్ల లీకులు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మోటార్లు అమర్చడం వంటి పనులకు నిధులు కోసం అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి రైతులు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– కేవీవీ సుబ్రహ్మణ్యం, ఈఈ

అవస్థలు పడుతున్నాం



గడిచిన సంవత్సర కాలం నుంచి సాగునీటికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా కళ్ల ముందే ఎత్తిపోతల పథకం ఉన్నా నీరు మాత్రం రాదు. పలు మార్లు అధికారులకు నివేదించాము. చిన్నపాటి మరామ్మతులు, ట్రాన్స్‌ఫార్మర్ వంటివి బాగు చేస్తే వందల ఎకరాలు సాగులోకి వస్తాయి. ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీటి అవస్థలు తీర్చాలి.

– బాదాన త్రినాథరావు, రైతు, రామచంద్రాపురం

ఈ ఏడాది ప్రశ్నార్థకమే



ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుతం వరి వెదలు, నారుమడుల్లో విత్తనాలు వేయడం దాదాపు పూర్తయ్యింది. ఇక నుంచి సాగునీరు అవసరం చాలా ఉంటుంది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాలు అన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలి. ప్రధానంగా రామచంద్రాపురం పథకం ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు ఎత్తికెళ్లడంతో ఈ ఇబ్బంది వచ్చింది. వెంటనే వీటిని బాగు చేయించి రైతులను ఆదుకోవాలి.

– బోర సుందరరావు, ఎంపీటీసీ, వెంకటాపురం

రెడ్‌బుక్ రాజ్యాంగం..

ఎన్నాళ్లూ సాగదు బాబూ..



మాట్లాడుతున్న తమ్మినేని సీతారాం

- రాష్ట్రాన్ని నారా వారి సారా సృజల స్రవంతిగా తయారు చేశారు
- పేదవాడికి వైద్యం, విద్య అందనంత దూరం
- ఏడాది పాలలోనే ప్రజలను మోసం చేసిన సీఎం చంద్రబాబు
- మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం ఇంకెన్నాళ్లు సాగదని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ వ్యవహారాల రాష్ట్ర కమిటీ సభ్యుడు, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని పూజారిపేటలో శనివారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా, ఆమదాలవలస నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వివిధ వర్గాల అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన పార్టీ నాయకులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని నారా వారి సారా సృజల స్రవంతిగా తయారు చేశారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటుకు చర్యలు చేపట్టి అందులో 5 కళాశాలలు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం 12 కళాశాలలను ప్రైవేట్ పరం చేసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందన్నారు. కూటమి ప్రభుత్వంలో పేదవాడికి వైద్య, విద్యం అందని ద్రాక్షగా మారయన్నారు. ఈ ఏడాది కాలంగా రాష్ట్రంలో హత్యలు, లూటీలు, ఆత్మహత్యలు, అక్రమాలు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ నెల 8న వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి. సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు చేతిలో రాష్ట్ర ప్రజలు మోసపోయారని, ఒక్క ఏడాదిలోనే ఇంత అసమ్మతిని మూటగట్టుకున్న ప్రభుత్వాన్ని ఇంతవరకు ఎప్పుడూ చూడలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేకుండా సీఎం చంద్రబాబు ప్రజలందరినీ మోసం చేశారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కాళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు అన్నారు.



పార్టీ అనుబంధ విభాగాల పదవులు పొందిన వారికి సన్మానిస్తున్న తమ్మినేని సీతారాం, నాయకులు

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు అన్ని వర్గాలవారు సిద్ధంగా ఉన్నారని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. కాలం ఒకేలా ఉండదని, మార్పులు వస్తాయని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చేస్తున్న అరాచకాలు, అక్రమాలు బయటపెట్టే రోజు దగ్గరలోనే ఉందని పార్టీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు బొడ్డేపల్లి నారాయణరావు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఎ.విజయ్, గుమ్మడి రాంబాబు, పప్పల రమేష్, బోర నర్సునాయుడు, బూరి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభినందన..



గీతికను అభినందిస్తున్న సూరిబాబు, తదితరులు

నరసన్నపేట: స్థానిక బజారు వీధికి చెందిన వైశ్యరాజు వెంకటఅమ్మన్న కుమార్తె గీతకను రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు శనివారం అభినందించారు. గీతిక నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 527వ ర్యాంకు సాధించారు. గీతిక నీట్‌లో మంచి ర్యాంకు సాధించడంతో స్థానిక కళింగ వైశ్యులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, ఎంపీటీసీ సభ్యుడు వైశ్యరాజు కేశవరాజు, పొట్నూరు పృథ్వీరాజ్, కోరాడ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సెలవులపై పునరాలోచన చేయాలి



లక్ష్మీనారాయణ

సారవకోట: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఇచ్చే ఐచ్ఛిక సెలవులపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో కోరారు. కొన్ని మతపరమైన పండుగలకు సాధారణ సెలవులుండవని, అటువంటి పరిస్థితిలో ప్రభుత్వం ఐచ్ఛిక సెలవులు మంజూరు చేస్తుందన్నారు. ప్రతిఏటా 5 ఐచ్ఛిక, 3 స్థానిక సెలవులు ఉపాధ్యాయులు, విద్యార్థులు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభుత్వం ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు మాత్రమే వినియోగించుకోవాలని కొత్త విధానం అమలులోకి తీసుకువచ్చిందన్నారు. దీని వలన ఒకే ఉపాధ్యాయుడున్న పాఠశాలల్లో ఐచ్ఛిక సెలవులను వినియోగించడం కుదరడం లేదన్నారు. దీనిపై పునరాలోచన చేసి పాత విధానాన్ని అమలు చేయాలని కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పోలీస్‌లు

సరుబుజ్జిలి: మహిళల రక్షణకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని స్థానిక ఎస్‌ఐ బి.హైమావతి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శనివారం శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. యువతులు, మహిళలు తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు.పీహెచ్‌సీ వైద్యాధికారి సాహితీప్రియదర్శిని, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి పాల్గొన్నారు.

గోకర్ణపల్లిలో తాగునీరు కలుషితం



తాగునీటి కుళాయి వద్ద పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్న అధికారులు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లి లో తాగునీరు కలుషితం కావడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో ఈ నెల 2వ తేదీన స్థానిక వైద్య సిబ్బంది తాగునీటి నాణ్యత పరీక్షలను నిర్వహించారు. స్వల్పంగా కలుషితమైనట్లు వైద్యాధికారి నవీన్ తెలిపారు. తాగునీటిని వినియోగించవద్దని, వినియోగించాల్సి వస్తే వేడి చేయాలని సూచించారు. తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. తాగునీటి పైపులైన్లు వద్ద, కాలువల్లోనే బ్లీచింగ్ చేయించారు. మరలా తాగునీటి పరీక్షలు చేయిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.వి.కె. నాయుడు తెలిపారు.

విచారణ..

- మరో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించేందుకు కుట్ర!



విచారణ నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చిరుద్యోగులపై (ఫీల్డ్ అసిస్టెంట్లు) కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఇప్పటికే మండలంలోని గోపాలపెంట, లుకలాం, ముద్దాడపేటల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను కక్షపూరితంగా తొలగించింది. తాజాగా ఉర్లాం ఫీల్డ్ అసిస్టెంట్ వాకముళ్ల రమేష్‌ను తొలగించేందుకు కుట్ర చేస్తోంది. వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా రమేష్ వ్యవహరిస్తున్నారనే నెపంతో టీడీపీకి చెందిన వారు ఫిర్యాదు చేశారు. శనివారం ఏపీడీ కె.లోకేష్, ఏపీఓ యుగంధర్ విచారణ నిర్వహించారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వేతనదారులతో రిపోర్టు రాయించుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు బందోబస్తు మధ్య విచారణ చేపట్టారు. విచారణకు ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, మాజీ ఎంపీటీసీ సతివాడ రామినాయుడు, మాజీ సర్పంచ్ జల్లు చంద్రమౌళి, పండి కృష్ణారావు హాజరయ్యారు.

10న వైఎస్సార్‌సీపీ సమావేశం



రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరణ
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఈ నెల 10న పాతపట్నం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం తెలిపారు. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ పేరుతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాతపట్నం బ్రాహ్మణ వీధి కూడలి వద్ద ఉన్న కేఎస్ఎం ప్లాజాలో ఉదయం 10 గంటల సమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, పోలాకి జయముని, గండివలస ఆనంద్, పెనుమజ్జి విష్ణు, మీసాల వెంకటరామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ లొలుగు లక్ష్మణరావు, బైపోతు ఉదయ్, సవర రమేష్, రెడ్డి రామారావు, ఐటీ వింగ్ విభాగం అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, బి.నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ వంగపల్లి చిన్నారావు, జి.యోగి, ఎ.వి.సురేష్, చింతాడ సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి



ఆమదాలవలస: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. దశమి సందర్భంగా అమ్మవారికి పండ్లు, కూరగాయలతో అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం

కొత్తూరు: కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి కె.రాణి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 231 కేసులకు రాజీ కుదిర్చారు. పలు కేసులకు సంబంధించి రూ.2,54,800 అపరాధ రుసుం వసూలు చేశారు. ఆస్తి తగాదాలతోపాటు ప్రమిసరీ నోట్ కేసులకు సంబంధించి రూ.2,20,000 చెల్లించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, ప్రధాన కార్యదర్శి వి.సుధాకరరావు, ఏజీపీ రాడ రాజు, కొత్తూరు, హిరమండలం, బత్తిలి పోలీసులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: జాతీయ లోక్ అదాలత్‌లో నరసన్నపేట కోర్టులో 155 కేసులు పరిష్కారమయ్యాయి. జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అధ్యక్షతన శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. 169 కేసులు రాగా.. వీటిలో 155 పరిష్కారమయ్యాయి. నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సి.హెచ్.దుర్గాప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: లోక్ అదాలత్‌లో పరస్పర అంగీకారంతో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు.



కొత్తూరు: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాణి

పొందూరు జ్యుడీషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. 303 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ మెంబర్‌గా సంతోష్‌కుమార్, న్యాయవాదులు, పొందూరు, జి.సిగడాం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: పాతపట్నం కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ లో 169 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాతపట్నం: ఈ నెల 6, 7వ తేదీల్లో పాతపట్నం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు టెక్కలి విద్యుత్‌శాఖ ఈఈ జి.శంకరరావు శనివారం తెలిపారు. ఆది, సోమవారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం, చంగుడి, సరాళి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నరసన్నపేటలో..

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల చోడవరం ఫీడర్‌లో సోమవారం నిర్వహణ పనులు, కొత్త లైన్లు వేయనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ శంకరరావు శనివారం ఒక తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పట్టణంలోని పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ కృష్ణాపురం ఫీడర్‌లో సోమవారం ట్రాన్స్‌ఫార్మర్స్‌ను వేరొక చోటకి మార్చటం, విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒక్క పార్వతీశంపేటకు మాత్రమే విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

వైభవంగా మారు రథయాత్ర



బూర్జ: మారు రథయాత్రలో పాల్గొన్న భక్తులు



పాతపట్నం: రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

బూర్జ: మండల కేంద్రంలో జగన్నాథ మారు రథయాత్ర శనివారం వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులు పూర్తికావడంతో గుండిచా మందిరం నుంచి జగన్నాథ స్వామి ఆలయానికి తిరుగు పయనమైయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పాతపట్నంలో..

పాతపట్నం: జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. స్థానిక బ్రాహ్మణవీధిలో ఉన్న గుండిచా మందిరం వద్ద ఉన్న స్వామివారు దశావతారాల్లో చివరిదైన కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారు గుండిచా మందిరం నుంచి ప్రధాన రహదారి మీదుగా రథాలను ఊరేగింపుగా వచ్చి జగన్నాథ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ

హిరమండలం: కంది విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి సంధ్యారాణి అన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయం ఎంటీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం కంది విత్తనాలు పంపిణీ చేశారు. పంట పొలాల గట్లపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచేందుకు అనువుగా ఉంటుందన్నారు. త్వరలో మొక్కలు కూడా అందిస్తామని చెప్పారు. మొక్కజొన్న, బంతి, ఆముదం వంటి విత్తనాలు అందిస్తామన్నారు.

ప్రమాదకరం



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస పంచాయతీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితిలో ఉన్నా, సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రొట్టవలస జంక్షన్‌తోపాటు, ఎస్సీ, బీసీ కాలనీల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. జనావాసాలకు సమీపంలో ఉండడం వలన వర్షాలు, గాలుల సమయంలో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలి

నరసన్నపేట: విద్యుత్ వినియోగదారులపై సర్‌చార్జీల పేరున అదనపు వసూళ్లకు కూటమి ప్రభుత్వం పాల్పడుతుందని, సర్దుబాటు చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఐ డిమాండ్ చేసింది. సీపీఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద సీపీఐ ప్రతినిధులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారులపై ఎటువంటి భారం మోపేది లేదని, ఒక్క పైసా కూడా అదనపు చార్జీలు వసూలు చేయమని ఎన్నికల ముందు కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత రూ.5 వేల కోట్లు సర్దుబాటు చార్జీల భారం విధించారని మండిపడ్డారు. ఈ చార్జీలు ఎత్తివేసే వరకు సీపీఐ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ ప్రతినిధులు

పెంచిన అదనపు చార్జీలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పేదలపై విద్యుత్ భారాన్ని మోపడం సరికాదన్నారు. స్మార్ట్ మీటర్లను రంగంలోనికి తీసుకువచ్చి విద్యుత్ బిల్లులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లకు సంబంధించి సెకీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రతినిధులు ఎస్.మధుసూదనరావు, భాస్కరరావు, వెంకటరమణ, లవుడు, చిన్నబాబు, కర్ణవీరుడు, రాజు, రాములమ్మ, అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

సరుబుజ్జిలి: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి జంక్షన్ వద్ద రూ.40 లక్షలతో నిర్మించిన కొత్తకోట సహకారం సంఘం గోదాంను శనివారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఏపీటీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పరామర్శ..



గుత్తావల్లిలో పొన్నాడ రామును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని గుత్తావల్లి గ్రామంలో ఇటీవల పాము కాటుకు గురైన పొన్నాడ రామును వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ శనివారం పరామర్శించారు. కొండాపురంలో ఇటీవల ఆపరేషన్ అయిన వావిలాపల్లి గోవిందరావును పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మదనాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొల్ల మల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, బొడ్డేపల్లి నాగరాజు, బొడ్డేపల్లి నారాయణమూర్తి, ఉప సర్పంచ్ డి.వి.నాయుడు, గంట్రేటి రాము, రాగోలు వెంకటరమణ, రాగోలు అప్పారావు, తదితరులు ఉన్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



ఈ చిత్రం కొత్తూరులోని పాలకొండ రోడ్డులో గల నాలుగు రోడ్ల కూడలి సమీపంలో చెరువును తలపిస్తున్న గుంత. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను బాగు చేస్తామని చెప్పి ఏడాది పూర్తయింది. చాలా రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న గొయ్యిని పూడ్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- కొత్తూరు